# దొంగకుట్టిన తేలు

-ఐతా చంద్రయ్య

వే మాసం సూర్యుడు ఉగ్రరూపం ఉపసంహ రించి గంటక్రితమే ఇన్స్పెక్షన్ బంగళా మీద మాయమైనాడు. బంగళా పక్కనే ఉన్న కోమటి చెరువు అలల గాలులు ఒంటికి హాయినిస్తున్నాయి.

ఇన్స్పెక్షన్ ముగించుకొచ్చి బంగళాలో జీబు దిగేప్పుడు కంటబడి కలవరపెట్టిన మెరుపుతీగ అరవింద్‌ను గిలిగింతలు పెడుతోంది.

"సార్! భోజనానికెల్దామా?" అడగలేక అడిగాడు స్టెనో గ్రాఫర్.

ఆఫీసర్ అరవింద్ చూపులు బంగారు గొలుసులో బిగించిన చేతి గడియారం మీదికెళ్ళాయి. ఎనిమిదైంది.

"నేనిప్పుడు రాలేను. మీరెళ్ళిరండి. జీబు తీసుకెళ్ళండి హోటల్దాకా." అంటూ వరండాలోకి చూస్తూండి పోయాడు.

జీబ్ వెళ్ళిపోయింది.

అరవింద్‌లో ఆరాటం పెరిగింది.

ఆమెక్కడా...

"మంచినీళ్ళుసార్... మా నాయిన వాచ్‌మెన్.... ఇచ్చి రమ్మన్నాడు."

అదే మెరుపుతీగ. హంసలా అడుగులేస్తూ వచ్చింది.

పెరినైస్... పల్లెటూరి పిల్లే. పిటపిట లాడ్తోంది. తెల్లని కుబుసంలాంటి ట్యూబ్‌లైటు ఓణీ... ఊరించే అంగసౌష్ఠవం... ట్యూబ్‌లైటు వెలుగును మించిన కాంతి ఆమె కళ్ళల్లో ఉంది.

"నీ పేరేమిటీ?" సగం కాల్చిన సిగరెట్ పీక నులిమిపారేశాడు.

"నా... పే...రా! నాపేరు... మయూరి సార్!" మొహం ముద్దబంతిపూవులా విచ్చుకుంది.

ఆహా... సార్థక నామధేయురాలు!

"ఇక్కడ పెడ్తున్నాసార్!" జగ్గుటేబుల్ మీదుంచి "నేంబోతున్నా సార్!" వెనుదిరిగింది.

"నువ్వు చాలా అందంగా... అంటే దేవకన్య లాగున్నావ్ మయూరీ!"

గుటకలువేస్తూ అభినందనాస్త్రం వేశాడు.

"హాయ్... నిజంగానా సారూ?"

తన ఒళ్ళు తానే చూసుకుని ముడుచుకు పోయింది.

మయూరి ముందు కొచ్చాడప్పటికే.

"నిజంగా... నిజం మయూరీ..." మయూరి వీపు నిమిరి కళ్ళల్లోకి చూశాడు.

"గిదేంది సారూ!" బుగ్గలు ఎర్రగులాబీలైనాయి. పక్కకు జరిగింది.

"ఏం లేదు మయూరీ! నీకు మా డిపార్ట్‌మెంటులో ఉద్యోగమిప్పిస్తా... చేస్తావా?"

"నాకా... సర్కారు నౌకరా...!" కళ్ళు అరచేతులంతైనై.. పగిలిన దానిమ్మ పండులా నవ్వింది.

"ఔను... నీకే!" చేతుల్తో చెంపల్ని నిమిరాడు.

"అబ్బ!.... గీ గడియారం... శానబాగుంది. నా చెయ్యిమీద ఎట్లుంటదో!" గడియారాన్నీ, చెయ్యినీ ముద్దుబెట్టుకుంది. మయూరి పెదాలు వణికినై. శ్వాసగాలి అరవింద్ చేతికి చల్లగా తగుల్తోంది.

"పెట్టుకుని చూడు!" తీసిచ్చాడు గడియారం.

"గీ ఉంగురం గూడా...!"

"ఇదిగూడా పెట్టుకో కాస్సేపు" తీసిచ్చాడు.

"హబ్బ... నా చెయ్యి... బంగారమోలె ఉంది గదసారూ!" కళ్ళు చక్రాల్లా తిరిగినై. దోరమాగిన మామిడిపండు దోసిట్లో కొచ్చినట్లైంది అరవింద్‌కు.

"ఆహా... అందమంటే నీదే సుమా!" అమాంతం చేతుల్లోకి తీసుకుని గుండెలకు హత్తుకోబోయాడు.

"మయూరీ... ఓ మయూరీ!" బయటి నుండి పిలుపు.

సీతాకోకచిలుకలా తుర్రుమంది మయూరి.

★ ★ ★

"మీ గడియారమేదండీ?" క్యాంపునుండి తిరిగొచ్చిన భర్తనుండి బ్రీఫ్‌కేసందుకుంటూ అడిగింది అమల.

ఏం చెప్పాలి?.... తేలు కుట్టిన దొంగయ్యాడు అరవింద్.

గబగబా డ్రెస్సు మార్చుకుని బాత్రూంలో చొరబడ్డాడు.

"గడియారమండీ... గడియారం. పోయిన సంవత్సరం మన పెళ్ళిలో మానాన్న బంగారు గొలుసు చుట్టించి పెట్టిన గడియారం. అరె..ఉంగరం గూడా లేదే!" ఒక చేత్తో కాఫీ కప్పు అందిస్తూ మరో చేత్తో భర్త ఉంగరం వేలందుకుంది.

"అవీ... అవి..." నీళ్ళునమిలి కాఫీ గడగడా తాగాడు.

"బ్రీఫ్ కేసులో ఉందా?"

"క్కా... కాదు. సిద్ధిపేటలో పోయినై అమలా!" భార్య కళ్ళలోకి చూశాడు.

"ఎలా?" కనుబొమ్మలు ముడిపడినై.

'ఎక్కడో పడిపోయినై."

"నిలువు దోపిడీ జరిగిందన్న మాట!"

"ఆ... అంతే...అహ... కాదు.. పడిపోయినై." తలనేలకు వేలాడేశాడు.

"అయ్యో... అంత బుద్ధావతారమా?"

"అబ్బా... నేనేం చెయ్యాలి అమలా!"

"ఏం చెయ్యాలా! పరాయి ఆడవాళ్ళను అక్కా చెల్లెళ్ళుగా చూస్తానని ఆ రోజు... నా బుగ్గగిల్లి మరీ చెప్పారు గదా! ఆమాట మీదుండాలంటాను."

"అబ్బా... దానికీ దీనికీ సంబంధమేమిటి?" రోషం పాలపొంగులా వచ్చింది. చటుక్కున తల పైకెత్తాడు ఆశ్చర్యం.

"నాకు నౌకరిప్పిస్తరా సారూ! ఇంగో మీ గడారం, ఉంగురం..." పక పకా నవ్వుతోంది మయూరి.

అదే మయూరి... కాని... వేషం.

"నమస్తే బావా! నాపేరు మయూరే... వాచ్‌మెన్ కూతుర్ని కాదు. అమలక్క మా పెద్దమ్మ కూతురు. మీ పెళ్ళప్పుడు డిగ్రీఫైనల్ పరీక్షల్లో ఉన్నాను. పాపం! మా అమలక్క మొగుడు అపరఋష్యశృంగుడనుకున్నాను.

పగలబడి నవ్వుతున్నారు అమల, మయూరి.

"మరీ...మరి... నిన్ను పిలిచిన మీ అక్కా..."

"మా అమలక్కే బావా! మాది సిద్ధిపేటనే. టట్టడాం...!"

దొంగకుట్టిన తేలైపోయిన అరవింద్ మొహం చూడముచ్చటేసింది అక్కా చెల్లెళ్ళకు. ★